క్లుప్తంగా

మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలి

సత్తెనపల్లి: మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని సత్తెనపల్లి ఆ.వో.పా పట్టణ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు ఆదివారం కోరారు. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని ప్రధాన కూడలి సమీపంలోని ఎం.ఎం.రోడ్డులో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి కొందరు ముష్కరులు పేడను పులిమి అగౌరవ పరచటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఆంధ్రప్రదేశ్‌ను తెచ్చిన మహానుభావుని విగ్రహానికే రక్షణ కరువైందన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిని శిక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు.

నేటి నుంచి జగనన్న ఇళ్లపట్టాలకు రిజిస్ట్రేషన్లు

క్రోసూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఈవోపీఆర్డీ పి.శివరామయ్య ఆదివారం తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయంలో సెక్రటరీ, వీఆర్వో ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని వివరించారు. లబ్ధిదారులు తమ పరిధిలోని సచివాలయానికి హాజరుకావాలని తెలిపారు. ఫిబ్రవరి నెల 9వ తేదీతో ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లన్నీ జిల్లా కలెక్టర్ అథారిటీతో కన్వేయన్స్ డీడ్ కాపీలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు.

వేగవంతంగా డబుల్ రోడ్డు పనులు



క్రోసూరు: రూ.149 కోట్ల నాబార్డు నిధులతో జరుగుతున్న అమరావతి–బెల్లంకొండ డబుల్ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, సైడు డ్రైన్లు, మార్గ మధ్యంలో కల్వర్టుల నిర్మాణాలు జరుగుతున్నాయి. క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్ నుంచి అమరావతి వైపు బీటీ రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయి. అదేవిధంగా క్రోసూరు నుంచి బెల్లంకొండ వైపు రోడ్డు పనులు జరుగుతున్నాయి. దొడ్లేరులో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రోడ్డుకు శంకుస్థాపన జరిగింది. అప్పటి నుంచి పనులు చకచకా సాగుతున్నాయి. ప్రజల చిరకాల కోరికైన ఈ రోడ్డు పూర్తయితే గ్రామాల్లో రైతుల వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, ఇసుక రవాణా, ప్రజల ప్రయాణాలకు సులభతరమవుతుంది. వీటితో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వరికపూడిసెలకు సత్వరమే నిధులు విడుదల చేయాలి

నకరికల్లు: పల్నాడుకు వరప్రదాయినిగా భావిస్తున్న వరికపూడిసెల ప్రాజెక్టుకు సత్వరమే నిధులు విడుదల చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కోటానాయక్ ఆదివారం డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో గత నెలలో శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు పనులు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే నిధులు విడుదల చేసి ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు గిరిజన సంఘం నాయకులు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



గాయపడిన మణికంఠ



మృతిచెందిన మల్లేష్

మాచర్ల రూరల్: గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెంది, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని భైరవునిపాడు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నాగార్జున సాగర్ నుంచి ద్విచక్ర వాహనంపై మల్లేష్ (30), కలివెల మణికంఠలు మాచర్ల వస్తుండగా భైరవునిపాడు గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మణికంఠ కాలికి తీవ్ర గాయాలు కాగా మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు. ఈ మేరకు విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏసు మార్గంలో నడవాలి

విజయపురిసౌత్: ప్రతి క్రైస్తవుడు తోటివారితో ప్రేమతో మెలగాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాల సాగర్ అన్నారు. ఆదివారం స్థానిక సాగర్ మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రతి క్రైస్తవుడు ఏసుక్రీస్తు మార్గంలో నడిచి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. దీనికి ముందు భక్తులు దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి తలనీలాలు, కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు.

పల్లె బిడ్డలు .. ఆటల్లో దిట్టలు



నందిగామలో వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



కొమెరపూడిలో కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు

- ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు
- సచివాలయం, మండల, నియోజకవర్గ స్థాయిలో సత్తా
- జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంత విద్యార్థులు సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయి క్రీడల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు. విద్యార్థులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తమ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రతిభ చూపుతున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలకు సంబంధించి క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొని తమలో ఉన్న క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీల్లో సచివాలయ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. ప్రస్తుతం నియోజకవర్గ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి జిల్లా స్థాయికి అర్హత సాధించారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

నేటితో ముగియనున్న నియోజకవర్గ స్థాయి పోటీలు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు సోమవారంతో ముగియనున్నాయి. గత నెల 26 నుంచి ఈ నెల 9 వరకు గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మండల స్థాయి పోటీలు ఈ నెల 10 నుంచి 23 వరకు నిర్వహించారు. మండల స్థాయి విజేతలకు నియోజకవర్గస్థాయి పోటీలు ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యాయి. సోమవారం శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. ఫైనల్ పోటీల్లో సత్తెనపల్లి–నకరికల్లు జట్లు తలపడనున్నాయి. వీటిలో గెలుపొందిన జట్టు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానాన్ని, ఓటమిపాలైన జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంటాయి. ముప్పాళ్ళ–రాజుపాలెం జట్ల మధ్య జరిగే పోటీల్లో గెలుపొందిన జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంటుంది. అలాగే ప్రగతి పాఠశాల క్రీడా ప్రాంగణంలో కబడ్డీ పురుషుల విభాగంలో నకరికల్లు–ముప్పాళ్ళ జట్ల మధ్య పోటీ జరగనుంది. గెలుపొందిన జట్టు ప్రథమ స్థానాన్ని, ఓడిన జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంటాయి. తృతీయ స్థానం రాజుపాలెం కైవసం చేసుకుంది. నియోజకవర్గ స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జట్లు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జిల్లా స్థాయి పోటీల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాయి.

బ్యాడ్మింటన్ అంటే ఎంతో ఇష్టం



నాకు బ్యాడ్మింటన్ అంటే ఎంతో ఇష్టం. ఓ వైపు ఇంటర్ చదువుతూనే నిత్యం సాధన చేస్తున్నా. ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు పోటీలు నిర్వహించడంతో రిజిస్ట్రేషన్ చేసుకున్నా. సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచా. ప్రస్తుతం జిల్లా స్థాయికి అర్హత సాధించా. రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలవాలన్నదే లక్ష్యం.

– ఆర్.దివ్యశ్రీ, క్రీడాకారిణి, సత్తెనపల్లి

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించా



పోటీ పడితేనే మనలో సత్తా తెలుస్తుంది. ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడా పోటీలు నిర్వహించడంతో వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించా. జిల్లా స్థాయిలో కూడా ప్రతిభ చూపుతా. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పేరు తీసుకురావాలన్నదే నా ఆశ.

– జి.నవనీత, క్రీడాకారిణి, సత్తెనపల్లి

ఆత్మవిశ్వాసంతో రాణిస్తున్నా



ఆడపిల్లలకు ఆటలెందుకనే వారి మాటలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపా. ఆత్మవిశ్వాసంతో పోటీల్లో రాణిస్తూ జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు అర్హత సాధించా. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపేందుకు కృషి చేస్తా. ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేయడం ఆనందంగా ఉంది.

– పి.లక్ష్మీ గోపిక, క్రీడాకారిణి, రాజుపాలెం

ఆటల్లో రాణించడమే లక్ష్యం



ప్రభుత్వం పారిపాలనను ఏ ఒక్కరికో పరిమితం చేయకుండా అందరినీ భాగస్వాములను చేస్తోంది. ఎంతో వ్యయ ప్రయాసలైనప్పటికీ ఆటల పోటీలను నిర్వహిస్తోంది. ఆటల పోటీల్లో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపా. ఖోఖో జట్టులో ప్రస్తుతం జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించా. పోటీ ఏదైనా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతా.

– షేక్.మస్తాన్ వలి, క్రీడాకారుడు, నకరికల్లు

ప్రతిభ చూపే అవకాశం వచ్చింది



గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహించడంతో ప్రతిభ చూపే అవకాశం వచ్చింది. సచివాలయ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచా. జిల్లా స్థాయిలో కూడా ప్రతిభ చూపి విజయం సాధిస్తా.

– కె.గోపి, క్రీడాకారుడు, నకరికల్లు

ప్రభుత్వ నిర్ణయం బాగుంది



గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించాలనే నిర్ణయం బాగుంది. ఈ పోటీల వల్ల నాలోని ప్రతిభ వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించగలననే నమ్మకం ఏర్పడింది. నిత్యం సాధన చేసి మెళకువలు నేర్చుకొని రాష్ట్ర స్థాయిలో గెలిచి పేరు తీసుకువస్తా.

– మస్తాన్‌వలి, క్రీడాకారుడు, ముప్పాళ్ళ

మాదలలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం నేడు

ప్రారంభించనున్న మంత్రి అంబటి రాంబాబు



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. రూ.40 లక్షల ఎంఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాన్ని ఈ నెల 29వ తేదీన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించనున్నారు. వీటితో పాటు రైతులు పంటలను నిల్వ చేసేందుకు గాను రూ.43.90 లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్(ఎంపీఎఫ్‌సీ) గోదామును ప్రారంభించనున్నారు. ఆ మేర అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు ఓర్వకల్లు తిరునాళ్ల లైసెన్సు హక్కుల వేలం

క్రోసూరు: అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామంలోని గంగాదేవీ పేరంటాళ్లమ్మ వారి దేవస్థానం తిరునాళ్ల సందర్భంగా సోమవారం లైసెన్సు హక్కుల వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం దేవస్థానం ఈవో జి.రామకోటిరెడ్డి తెలిపారు. క్రోసూరులోని వీరభద్రమల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 11 గంటలకు వేలం పాటలు జరుగుతాయన్నారు. లైసెన్సు హక్కులు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి 25 వరకు అదేవిధంగా మార్చి 24 నుంచి 26 వరకు ఉంటాయన్నారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు, చీరలు, జాకెట్ ముక్కలు సేకరించు హక్కు, లడ్డూప్రసాదములు, కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించుకునే హక్కులకు పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు చొప్పున ధరావత్తు చెల్లించాలన్నారు. పాటలలో హెచ్చు ధరకు పాడుకున్న వారికి మినహా ధరావత్తు సొమ్ము మిగతావారికి వాపసు చేయబడుతుందన్నారు.

జగనన్నది సంక్షేమ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి అంబటి, నాయకులు

- దుర్మార్గపు పాలన చంద్రబాబుది
- రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: సచివాలయాలు వలంటీర్ల సరికొత్త వ్యవస్థ ద్వారా సంస్కరణతో కూడిన సుపరిపాలనను ప్రజల గడప వద్దకే తీసుకొచ్చిన ఘనత యువ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదని, ఇచ్చిన హామీని ఒక్కటి కూడా నిలబెట్టుకోకుండా దుర్మార్గపు పాలన చేసిన చరిత్ర చంద్రబాబు నాయుడుదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. మండలంలోని పెదనెమలిపురి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఒక్కొక్క సచివాలయాన్ని రూ.40 లక్షలతో నిర్మించిన రెండు సచివాలయాలను, వాగుపై రూ.20 లక్షలతో నిర్మించిన చప్టాను, పంచాయతీ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ఆదివారం ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీటీసీ కందులూరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా మంత్రి అంబటి మాట్లాడుతూ ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఇంటి వద్దకే పాలన, గడప వద్దకే వైద్యం, రైతుల వద్దకే వ్యవసాయశాఖ సేవలన్నింటిని అందిస్తున్నామన్నారు. మీ గ్రామంలోనే ఆర్‌బీకేలు రైతులకు సేవలందిస్తున్నాయన్నారు. ఇక నుంచి మీ ఊరు గ్రామ సచివాలయాల ద్వారానే భూముల రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయని తెలిపారు. నియోజకవర్గంలో పారదర్శక పాలన అందించామని గర్వంగా తెలిపారు. ప్రజల ఆశీస్సులు ఉన్నంత కాలం జగన్‌ను ఓడించడం ఎవరివల్ల కాదన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, లాయర్ పక్కాల సూరిబాబులు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ లోకి చేరికలు..

నెమలిపురిలో టీడీపీకి చెందిన 11 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. బత్తుల సాంబశివరావు, బత్తుల వీర్లవెంకయ్య , వీర్ల కోటేశ్వరరావు, వీర్ల శ్రీనుబాబు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి చిన్నవెంకటేశ్వర్లు, బత్తుల నాగేశ్వరరావు, షేక్ బాబూసాహేబ్, దూదేకుల సయ్యద్‌జాన్, దూదేకుల శివ, వేముల నాగయ్యలకు రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కొర్రకూటి వెంకయమ్మశ్రీనివాసరావు, జెడ్పీ పాఠశాల కమిటీ చైర్మన్ తాటికొండ అంకమ్మరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లగొర్ల సీతారామయ్య, మర్రి నరసింహారావువేలాద్రి, కందులూరి పకీరయ్య, ఏఎంసీ డైరెక్టర్ నాగేంద్రం గోవిందరాజు, సర్పంచ్‌లు పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ పాలవాయి ఆదినారాయణ, ఎంపీటీసీ నకరికంటి మస్తాన్ తదితరులున్నారు.

బీజేపీ మత రాజకీయాలపై పోరాడదాం



సమావేశంలో మాట్లాడుతున్న గంజిమాల రవిబాబు

అమరావతి: మతరాజకీయాలు చేసి మూడోసారి అధికారంలోకి రావాలన్న బీజేపీ ప్రయత్నాలను తిప్పికొట్టటానికి లౌకికవాదులందరూ పోరాడాల్సిన అవసరముందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంజిమాల రవిబాబు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాజ్యాంగంలో లౌకికతత్వాన్ని, రాజ్యాంగ విలువలను నరేంద్ర మోదీ నాశనం చేస్తున్నాడన్నారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తుంటే నిరుద్యోగ సమస్యను, వ్యవసాయ రంగం దివాలా తీసి రైతులు ఆత్మహత్య చేసుకుంటే బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. మరో పక్క నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి అన్యాయం చేసిన బీజేపీతో రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు పొత్తుల కోసం వెంపర్లాడటం దారుణమన్నారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ అధికారంలోకి రావాలనే రాజకీయ దురుద్దేశంతో టీడీపీ, జనసేన బీజేపీతో చేతులు కలపటం రాజకీయ కపట నాటకానికి నిదర్శమన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక శక్తుల్ని కలుపుకొని సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. ఏపీలో కూడా బీజేపీ వ్యతిరేక శక్తులను కలుపుకొని రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీపీఎం పార్టీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు సయ్యద్ మోహిదీన్ వలి, ఎం.సుబ్రహ్మణ్యం వెంకటేశ్వరరాజు, నాగుల మీరా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్

- పెదకూరపాడు మండలంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పర్యటన
- మూడు గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా, హెల్త్‌సెంటర్లు ప్రారంభం
- గారపాడులో చెక్ డ్యాం, సిమెంట్ రోడ్లు ప్రారంభం
- పెదకూరపాడులో ఆసరా చెక్కులు పంపిణీ



పెదకూరపాడులో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం


పెదకూరపాడు: పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా మహిళల రుణాలను తీర్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మంది అక్క చెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు నింపారని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. పెదకూరపాడు మండలంలో 730 డ్వాక్రా సంఘాలకు రూ.6.63 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి చేయాలన్న సంకల్పం ఉంటే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని పనులు సీఎం జగన్మోహన్‌రెడ్డి చేశారన్నారు. గతంలో చంద్రబాబు రుణమాఫీ, జాబులిస్తాం అని చెప్పి అధికారంలోకి రాగానే మాట తప్పారన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్షల ఉద్యోగాలివ్వడమే కాకుండా సచివాలయ వ్యవస్థతో పౌరసేవలను గడప ముందుకే తెచ్చారన్నారు. రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లతో ప్రజా సంక్షేమానికి అసలైన అర్థం చెప్పారన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. నాలుగున్నరేళ్లలో సుమారు రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అమరావతి–బెల్లంకొండ డబుల్ రోడ్డు పూర్తి చేస్తున్నామన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు రూ.23 కోట్లతో ఆసుపత్రులు నిర్మించామన్నారు. భవిష్యత్‌లో పులిచింతల బ్యాక్ వాటర్ నుంచి క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాల రైతులకు సాగునీరు అందించే ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు. తనపై విమర్శలకు స్పందించిన ఆయన నాది వ్యక్తిగతంగా దూషణలు చేసే సంస్కృతి కాదన్నారు. నేను చేసిన అభివృద్ధే సమాధానం అన్నారు. కేవలం ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. మీ కుటుంబ సభ్యునిగా భావించి నాకు అండగా నిలవాలని ప్రజలను కోరారు.

విమర్శలకు మన గెలుపే సమాధానం..


ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై చేస్తున్న విమర్శలకు రాబోయే ఎన్నికల్లో గెలుపే సమాధానం అని ఎమ్మెల్యే సతీమణి వసంతకుమారి అన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు చేసే వారి విచక్షణ ఏపాటిదో ప్రజలు గమనిస్తున్నారన్నారు. తాము విలువలతో కూడిన రాజకీయాలు చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆవేశపడొద్దన్నారు. విమర్శలకు శంకరరావు గెలుపుతో సమాధానం చెబుదామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన..

మండలంలోని గారపాడు గ్రామంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.20 లక్షలతో నిర్మించిన చెక్ డ్యాంను, రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే పెదకూరపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జలాల్‌పురంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్‌ను గ్రామ సర్పంచ్ మాదిరెడ్డి సుజాతతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. బలుసుపాడు గ్రామంలో రూ.80 లక్షల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ అభివృద్ధి చేస్తున్నాము.. అండగా నిలవాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు పార్టీ కార్యకర్తలను పరామర్శించారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, జిల్లా పార్టీ నాయకులు శివాజీ, వైస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషా, మండలపార్టీ కన్వీనర్ మస్తాన్ షరీఫ్, సర్పంచ్ మాదిరెడ్డి సుజాత, పార్టీ నేతలు భార్గవ్, సుభాని, షఫీ, వెంకటేశ్వర్లు, హనుమంతురావు, పరిపూర్ణరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



జలాల్‌పురంలో హెల్త్ క్లినిక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



గారపాడులో చెక్ డ్యాం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

వైభవంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు



కీర్తనలు ఆలపిస్తున్న రవికులోత్తమరావు

సత్తెనపల్లి: పట్టణంలోని శరభయ గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడామైదానం సమీపంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా జరిగాయి. హైదరాబాదు ప్రసిద్ధ సంగీత విద్వాంసులు బ్రహ్మశ్రీ రవికులోత్తమరావు, ఆర్ సుధాలక్ష్మి, మల్లెల దక్షిణామూర్తి, ఎస్.షణ్ముఖ, వి.వెంకటేష్‌ల బృందం సంగీత సాహిత్యాలను సమపాళ్ళలో మేళవించి, స్వరరాగ సుధా రస ధారలతో సకల జగత్తును రసానంద డోలికలలో ఓలలాడించారు. పంచరత్నాలతో పాటు పలు త్యాగయ్య కీర్తనలను ఆలపించి సంగీత ప్రియులకు శ్రవణానందం కలిగించారు. స్వామి వివేకానంద చైతన్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు కొల్లిపర కాశీవిశ్వనాధం నేతృత్వంలో సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.